క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో ఆదివారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రీడీ సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక జెడ్పీహైస్కూల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 4గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. మదనపల్లెకు చెందిన డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించబోయే ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి శుక్లాలు, కేటరాక్ట్ ఉన్నవారిని ఎంపిక చేసి వారికి మదనపల్లెలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌ఐల నియామకం

పెద్దతిప్పసముద్రం: తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఎస్‌ఐలుగా పని చేస్తున్న వారిని బదిలీ చేస్తూ వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దతిప్పసముద్రం మండలంలో పని చేస్తున్న రవీంద్రబాబును లక్కిరెడ్డిపల్లికి బదిలీ చేయగా ఆయన స్థానంలో పీలేర్‌లో ఎస్‌ఐగా ఉన్న నరసింహులును ఇక్కడకు నియమించారు. అదే విధంగా రాయచోటి దిశ స్టేషన్‌లో పని చేస్తున్న గాయత్రిని ములకలచెరువుకు, సోమలలో పని చేస్తున్న శివశంకర్‌ను పెద్దమండ్యంకు , నిమ్మనపల్లిలో పని చేస్తున్న లోకేష్‌రెడ్డిని తంబళ్లపల్లికి, పీలేర్‌లో పని చేస్తున్న దిలీప్‌ను ముదివేడు స్టేషన్‌కు నియమించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థుల సంఘ అధ్యక్షురాలు తేజోవతి మాట్లాడుతూ కాలేజీ అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు. కాలేజీలో చదవడం వలన తాము ఉన్నత స్థాయికి చేరుకున్నామని తెలిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు రుణపడి ఉంటామన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి మాట్లాడుతూ తొలిసారిగా కాలేజీలో పూర్వపు విద్యార్థుల సమావేశం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి కాలేజీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అధ్యాపకులు మోహన్‌వల్లి, విష్ణుప్రియ, జ్యోతి, పూర్వపు విద్యార్థులు కౌసర్ పాల్గొన్నారు.

గౌస్‌బాషాకు లెజండరీ పురస్కారం



అవార్డు అందుకుంటున్న గౌస్‌బాషా

పీలేరు : పీలేరు పట్టణానికి చెందిన స్క్రిప్ట్ రైటర్ షేక్ గౌస్‌బాషాకు అల్లూరి సీతారామరాజు లెజెండరీ పురస్కారం లభించింది. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్. సరోజనమ్మ, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమనోహర్, సింగర్, హీరోహిన్ ఫైజన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పిచ్చి డాక్టర్, విరోధి, ఆదర్శ విద్యార్థులు, గందరగోళం, నిరుద్యోగి, మట్టిలో మాణిక్యం, బుర్రకథలు, అడవిలో అన్నలు, తొలిరోజు లాంటి కథనాలకు 27 సంవత్సరాల తరువాత అవార్డు లభించిందని గౌస్‌బాషా హర్షం వ్యక్తం చేశారు.

సైన్స్ పోటీల్లో వీఎస్‌ఎన్ సత్తా

పీలేరు : మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ)లో నేషనల్ స్పేస్ డే 2024 వేడుకల్లో భాగంగా జరిగిన సైన్ ఫెయిర్ అండ్ క్విజ్ పోటీల్లో పీలేరు వీఎస్‌ఎన్ సిద్ధార్థ విద్యార్థులు సత్తా చాటారని ఆ పాఠశాల కరస్పాండెంట్ మాధవి తెలిపారు. 8, 9వ తేదీల్లో జరిగిన పోటీల్లో సుమారు 60 పాఠశాలల విద్యార్థులు పోటీ పడగా వీఎస్‌ఎన్ సిద్ధార్థ పాఠశాలల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



సీఐ యుగంధర్‌ను సన్మానిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

పీలేరు రూరల్ : శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని యుగంధర్ బిస్మిల్లా తెలిపారు. పీలేరు అర్బన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యుగంధర్ బిస్మిల్లా ఆటో యూనియన్ శనివారం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోల సంఖ్య ఎక్కువగా ఉన్నాయని, నిబంధనలకు లోబడి ఆటోలు నడపాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆటో యూనియన్ నాయకులు బోదేషా, ఖాసీం సాహెబ్, సురేష్ బాబు, సదాశివకుమార్, భాస్కర్, వెంకటరమణ, భాషా పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం



వాల్మీకిపురం: ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న వేదపండితులు



వాల్మీకిపురం: శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం : వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభి రామాలయంలో శనివారం పట్టాభిషేక మహోత్సవాలలో భాగంగా ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. భోగోత్సవమూర్తులైన సీతారామలక్ష్మణులకు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో వైభవంగా సీతారాముల శాంతి కల్యాణం, ఊంజలసేవ నిర్వహించారు. రాత్రి హనుమంత వాహనంపై సీతారామలక్ష్మణులకు విశేష అలంకరణలు అధిరోహించి, తిరుమాడ వీధుల్లో విహరించి, భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేడు

నేడు ఉదయం యాగశాల వైదిక కార్యక్రమాలు, స్నపన తిరుమంజనం, శ్రీరామ పట్టాభిషేకం, సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రికి గరుడ వాహనంపై శ్రీ సీతారాముల విహారం జరుగుతుందని ఆలయ అధికారి క్రిష్ణమూర్తి తెలిపారు.

వైభవంగా కావిళ్ల పండుగ

రామసముద్రం: మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీలోని తిరుమలరెడ్డిపల్లి గ్రామంలో శనివారం భక్తిశ్రద్ధలతో కావిళ్ల పండుగ నిర్వహించారు. రామసముద్రం, తిరుమలరెడ్డిపల్లి గ్రామస్తులు ఉపవాస దీక్షతో సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పసుపు వస్త్రాలు ధరించి కావిళ్లను పూజించి హరోహర అంటు స్వామివారిని దీక్షించి మడుపులు చెల్లించేందుకు తమిళనాడులోని తిరుత్తణిని బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామం బంధుమిత్రులతో కలకలలాడింది.

ఘనంగా ఉత్సవాలు

గుర్రంకొండ: మండలంలోని సంగసముద్రం గ్రామంలో కోదండ రామస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. అర్చకులు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో స్వామివారికి ఉత్సవాల సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు,హోమాలు నిర్వహించారు. మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివార్లకు ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష్మీనరసింహునికి విశేష పూజలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంత సేవ కావించారు. ఈ సందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

శ్రావణమాస పూజలు

రామసముద్రం: రామసముద్రం మండలంలోని దిన్నిపల్లె సమీపంలోని గెవితిమ్మరాయస్వామి ఆలయంలో శ్రావణ శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కులశేఖర్‌బట్టర్, అనిల్‌స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లెలో కుషావతీ నది ఒడ్డున వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. శ్రావణమాసం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవంనిర్వహించారు.కల్యాణోత్సవానికి భక్తులు, ప్రజలు తరలివచ్చారు. సర్పంచ్ పీరాన్‌బి, ఎంపీటీసీ బోడిమాని గీత, వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ గలా నరసింహులు, భక్తులు పాల్గొన్నారు.



గుర్రంకొండ: స్వామివారి ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు



రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లిలో కావిళ్లతో భక్తులు

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె : స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. శనివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన వంటకార్మికులు, స్కూల్ స్వీపర్లు తదితర కార్మికులపై గ్రామాల్లో రాజకీయ వేధింపులు అధికమయ్యాయని తెలిపారు. రాజకీయ కక్షలతో అక్రమంగా విధుల్లో నుంచి తొలగిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులు చిరుద్యోగులను బెదిరించి, వారి కడుపు కొట్టాలనుకుంటున్నారని ఆరోపించారు. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, రెడ్డెప్ప, మురళీ, చలపతి, కదిరప్ప పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో డెంగీ పంజా



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి రక్షిత

తంబళ్లపల్లె: తంబళ్లపల్లెలో డెంగీ విజృంభిస్తోంది. ముగ్గురు చిన్నారులకు డెంగీ సోకడంతో కలకలం రేపింది. తంబళ్లపల్లె మండల కేంద్రంలో ముగ్గురు బాలికలకు డెంగీ జ్వరం నిర్ధారణ కావడంతో ఆందోళన కలిగిస్తోంది. తంబళ్లపల్లె మండల కేంద్రానికి చెందిన రక్షిత (10) రెడ్డికీర్తన (9), సిద్దారెడ్డిపల్లెకు చెందిన కవిత (14) ముగ్గురు బాలికలు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. వీరిని శుక్రవారం కుటుంబ సభ్యులు చికిత్స కోసం తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. డెంగీ అనుమానిత లక్షణాలు ఉండటంతో ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారి వెంకటరామయ్య తెలిపారు. అప్రమత్తమైన వైద్యాధికారి ఇద్దరు బాలికలను రక్షిత, కవితలను ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని చికిత్స చేస్తున్నారు.

ఘనంగా శంకరంబాడి సుందరాచారి జయంతి



సుందరాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాల్మీకిపురం : స్థానిక డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ఆవరణంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తెలుగుతల్లికి మల్లెపూదండ గేయ రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరాచారి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి ప్రిన్సిపాల్ కల్పన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ శంకరంబాడి రచించిన మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతం 1975లో జరిగిన తొలి తెలుగు ప్రపంచ మహాసభలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర గీతంగా గుర్తించారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ రామలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, ఫర్‌హత్‌కౌసర్, జ్యోతి, సత్యమ్మ, శైలజ, గౌతమి, రేఖ, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



గుండె పరీక్ష శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మదనపల్లె : బెంగళూరు వైదేహి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చి సెంటర్, పట్టణంలోని సత్సంగ్ ఫౌండేషన్ స్వాస్థ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత గుండె పరీక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. వైదేహి హాస్పిటల్ హెడ్ ఆఫ్ కార్డియాక్ సైన్సెస్, సీనియర్ హార్ట్ సర్జన్ డాక్టర్.దుర్గాప్రసాద్‌రెడ్డి, వైద్యులు శిబిరానికి హాజరైన రోగులను పరీక్షించారు. ఈసీజీ, 2డి-ఎకో స్కాన్, బీపీ పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా స్వాస్థ హాస్పిటల్ డైరెక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముంతాజ్‌అలీ (శ్రీఎం) ఆధ్వర్యంలో నడుపుతున్న స్వాస్థ ఆస్పత్రి చారిటీ హాస్పిటల్ అని అన్నారు. పట్టణ ప్రజలు స్వాస్థ ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహమ్మద్ ఫాజిల్ అక్సరీ, మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్ ఆజం, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరు రఫీ, ఆర్‌ఎంఓ ఉమేష్, డాక్టర్.కృష్ణతేజ, పవన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



తహసీల్దార్ సయ్యద్ అహ్మద్

పెద్దమండ్యం: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి తహసీల్దార్‌గా సయ్యద్ అహ్మద్ తెలిపారు. పెద్దమండ్యం తహసీల్దార్‌గా సయ్యద్ అహ్మద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధులలో భాగంగా ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన లక్ష్మీనాయక్‌ను ఇటీవల అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. కలికిరి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ అహ్మద్‌ను తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాలిచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయన వీఆర్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ములకలచెరువు: మండల తహసీల్దార్‌గా ప్రదీప్ నియమితులయ్యారు. ఈయన గతంలో కలకడ మండలంలో పని చేసేవారు. రెండు రోజుల్లో ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు.

పంద్రాగస్టు వేడుకలకు విద్యార్థి ఎంపిక



లోహితారెడ్డి

కురబలకోట: విజయవాడలో జరిగే స్వతంత్ర దినోత్సవ వేడుకలకు మదనపల్లె దగ్గర అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల మూడవ సంవత్సరం బిటెక్ విద్యార్థి, ఎన్‌సీసీ క్యాడెట్ లోహితారెడ్డి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. శారీరక ధృడత్వం, డ్రిల్, నైపుణ్యం, ఎన్‌సీసీలో పనితీరుతో పాటు వివిధ అంశాలను పరిశీలించి లోహితారెడ్డిని ఎంపిక చేసినట్లు తెలిపారు. అరుదైన ప్రతిష్టాత్మక అవకాశం మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థికి రావడంతో కరస్పాండెంట్ ఎస్. విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ నవీన్‌కుమార్ అభినందించారు.

ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు నిర్వహిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : దేశభక్తి ఉట్టిపడేలా, మహనీయుల త్యాగఫలాలను స్మరించుకునేలా, స్వాతంత్రోద్యమ స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో కలిగేలా పట్టణంలో స్వాతంత్య్ర సంబరాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లకు సంబంధించి నియోజకవర్గస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో మదనపల్లె పట్టణానికి ప్రత్యేక స్థానం ఉందని గుర్తు చేశారు. స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్న స్వాతంత్య్ర సమరయోధులు, నాయకులు వారు చేసిన త్యాగాలు భావితరాలకు తెలపాలనే ఉద్దేశంతో మూడురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జ్ఞానాంబిక కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, డీఎస్పీ డి.కొండయ్యనాయుడు, తహసీల్దార్ ఖాజాబీ, కమిషనర్ కే.ప్రమీల, విజయభారతి ఎన్.సేతు, నాదెళ్ల విద్యాసాగర్, జల్లా లలితమ్మ, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, సీఐలు ఎన్.శేఖర్, చాంద్‌బాషా, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలికవసతుల కల్పనకు కృషి

మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం మండల కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, బెల్లేప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

రామసముద్రం: 78వ స్వాతంత్య్ర దినోత్సవం రోజు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి, స్వాతంత్య్ర సమరయోధులకు పుష్పంజలి ఘటించాలని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బి.నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం రామసముద్రంలో బీజేపీ మండల స్థాయి కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా రామసముద్రం ఎగువపాళ్యంకు చెందిన కృష్ణప్పను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆనంద్ కుమార్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, మండల కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పీలేరు రూరల్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 51వ ఆవర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు సదాశివరెడ్డి మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న చిన్న సంఘాలను, చిన్న విభాగాలను ఐక్యం చేస్తూ యూటీఎఫ్ ఏర్పడిందని తెలిపారు. యూనియన్ ఏర్పాటుకు దాచూరి రామిరెడ్డి, చెన్నపాటి లక్ష్మయ్య కృషి అభినందనీయమని కొనియాడారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో విజయాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం సాగిస్తామని చెప్పారు. యూటీఎఫ్ నాయకులు రాధాకృష్ణ, శివారెడ్డి, చెంగల్‌రాయుడు, చెంగారెడ్డి, మహేంద్ర, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పులికల్లుకు చెందిన లక్ష్మీనారాయణ అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఈ నెల 8న గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో బాధితుడు చికిత్స పొందుతున్నాడు. శనివారం లక్ష్మీనారాయణతో పాటు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పరామర్శించి జరిగిన ఘటన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో పాటు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నిందితులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

రాజంపేట రూరల్ : అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగలను ఎస్సీ వర్గీకరణ పేరుతో విడదీయడాన్ని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేపడతామని అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ్ తెలియజేశారు. మండల పరిధిలోని కే బోయినపల్లి వద్దనున్న అన్నమయ్య సర్కిల్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా జనగణన ప్రాతిపదిక ప్రకారం మెజార్టీ ప్రజల అభిప్రాయం తీసుకొని వర్గీకరణ చేయాలని కోరారు.

ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఖాజాబీ

మదనపల్లె : మండలంలోని చీకలబైలు, వేంపల్లె, మాలేపాడు, పెంచుపాడు, కోళ్లబైలు గ్రామాల్లోని ఫ్రీహోల్డ్ భూములను శనివారం తహసీల్దార్ ఖాజాబీ పరిశీలించారు. మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ రెడ్డెప్ప తదితరులతో కలిసి ఆయా పంచాయతీల్లో 22(1), నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములను పరిశీలించారు. అనుభవంలోని వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాబితా నుంచి తొలగించిన భూముల రికార్డులు పరిశీలించారు.

కూలి పడేదెప్పుడో.. కడుపు నిండేదెన్నడో..!

- ఉపాధి నగదు అందక కూలీలకు ఇక్కట్లు
- మండలంలో రూ.1.12 కోట్ల మేర బకాయిలు

చిన్నమండెం : గ్రామాల్లో ఇప్పటికీ వ్యవసాయం తరువాత అండగా ఉంటోంది గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులే. కానీ రెండు నెలలుగా ఉపాధి నగదు పడకపోవడంతో.. కూలీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏ రోజుకారోజు కూలీనాలి పని చేసుకొని జీవనం సాగించే వారు తల్లడిల్లుతున్నారు. ఓ పక్క బకాయిలు అందక, మరోపక్క కూలీ పనులు లేక అవస్థల పాలవుతున్నారు. మండలంలో 8273 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. వారిలో ఈ ఏడాది 13336 మంది కూలీలు ఉండగా, 1406 మంది పని చేశారు. వారిలో కొన్ని శ్రమశక్తి సంఘాల ఉపాధి కూలీలకు పైసా కూడా బిల్లులు రాలేదు. కొన్ని గ్రామాల్లో 10 వారాలకు మాత్రమే ఉపాధి బిల్లులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. 13 వారాలకు ఉపాధి కూలీల బిల్లులకు రూ.1.12 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. మండుటెండలో కష్టపడి పని చేసినా.. నేటికీ బిల్లులు రాకపోవడంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి వారానికి ఉపాధి కూలీల బిల్లులు బ్యాంక్‌లో జమ అయ్యేవని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ డిపోకు మేనేజర్ కావలెను..!

- ప్రయాణికుల అవస్థలు
- మేనేజర్ లేక తగ్గుతున్న ఆదాయం



మదనపల్లె ఆర్టీసీ డిపో-2 బస్టాండు

మదనపల్లె సిటీ: మదనపల్లె ఆర్టీసీ-2 డిపో మేనేజర్ పోస్టు భర్తీ కాలేదు. డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ ఐదు నెలల క్రితం సస్పెండ్ అయ్యారు. దీంతో అప్పటి నుంచి పోస్టు భర్తీ చేయలేదు. డిపోలో 105 వరకు బస్సు సర్వీసులు ఉన్నాయి. సుమారు 417 మందికిపైగా సిబ్బంది పని చేస్తున్నారు. దీంతో పాటు బస్టాండు వ్యవహారాలతో పాటు గ్యారేజీలను నిత్యం పర్యవేక్షించాలి. అదనంగా కార్గో కొరియర్, బస్టాండులో షాపులతో పాటు వాహనాల పార్కింగ్‌ను పర్యవేక్షించాలి. డిపోకు నిత్యం పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు వస్తాయి. డిపో మేనేజర్ పోస్టు భర్తీ కాకపోవడంతో సిబ్బందితో పాటు ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ డిపో నుంచి విజయవాడ, తిరుపతి, చెన్నైతో పాటు పలు దూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. గతంలో విహార యాత్రలతో పాటు పుణ్యక్షేత్రాలుకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేవారు. దీంతో డిపోకు ఆదాయం బాగా వచ్చేది. ప్రస్తుతం ప్రత్యేక బస్సు సర్వీసులు నడకపోవడం, అదనపు సర్వీసులపై దృష్టి సారించకపోవడంతో ఆదాయం తగ్గుముఖం పట్టింది.

ఇన్‌చార్జ్‌గా డిపో-1 డీఎం

ఆర్టీసీ-2 మేనేజర్ పోస్టు ఖాళీగా ఉండటంతో స్థానిక వన్‌డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. ఈయన వన్ డిపోను పర్యవేక్షించడంతో పాటు అదనంగా టు డిపో బాధ్యతలు తీసుకున్నారు. దీంతో రెండు డిపోల బాధ్యత భారంగా మారింది. ఆయన శిక్షణ, సమావేశాలకు వెళితే డిపో నిర్వహణ కింద స్థాయి ఉద్యోగులు చూసుకోవాల్సి ఉంది. అయితే కింది స్థాయి ఉద్యోగులు దీన్ని బాధ్యత తీసుకోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవ తీసుకుని మదనపల్లె టు డిపోకు డీఎంను నియమించాలని డిపో కార్మికులు కోరుతున్నారు.